
తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం-27-సెప్టెంబర్-2025 | సంపుటి:3 | సంచిక:122 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in




# బీసీలకు 42 % రిజర్వేషన్లు

- జీఓ విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- నేడో,రేపో స్థానిక నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబరు 26 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ09ను విడుదల చేసింది. ఈ నిర్ణయం ద్వారా గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, పురపాలక సంస్థలు, మహానగర పాలక సంస్థల్లో బీసీ వర్గాల ప్రాతినిధ్యం మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఉన్న కేటాయింపుతో పోలిస్తే ఇది గణనీయమైన పెంపు కావడంతో వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం ఉ.11 గంటలకు అత్యవసర సమావేశం నిర్వహించనుంది.

మిగతా 2లో..

# తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, అక్టోబర్ 1వ తేదీన ఆయన కొత్తగా బాధ్యతలు చేపట్టనున్నారు.

**శివధర్ రెడ్డి ప్రస్థానం ..**

శివధర్ రెడ్డి హైదరాబాద్‌లో జన్మించారు. వారి స్వస్థలం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలేకలాన్ గ్రామం. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు హైదరాబాద్‌లోనే పూర్తిచేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌బీ చేశారు. కొంతకాలం న్యాయవాదిగా పని చేసిన ఆయన, తర్వాత సివిల్ సర్వీసెస్‌లో ఎంపికై 1994లో ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో చేరారు.

మిగతా 2లో..



# నేడు తెలంగాణ పర్యాటకం కాంక్లేవ్

## నూతన ప్రాజెక్టులు, యువతకు ఉపాధి అవకాశాలు

హైదరాబాద్,సెప్టెంబర్26 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రపంచ పర్యాటకులను ఆకర్షించడమే కాక, పర్యాటక రంగంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యంతో కొత్త పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ శిల్పారామం వేదికగా ఈ శనివారం నిర్వహించే తెలంగాణ పర్యాటకం కాంక్లేవ్ - 2025లో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నూతన ప్రాజెక్టులను ఆవిష్కరించనున్నారు. ఈ కాంక్లేవ్‌లో పర్యాటక పాలసీని ఆవిష్కరించడం ద్వారా రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన హోటళ్లు, వెల్‌నెస్ కేంద్రాలు, హాస్పిటాలిటీ ప్రాజెక్టుల ఏర్పాటు పట్ల పలు సంస్థలు ముందుకొచ్చాయి.

అనంతగిరి కొండల్లో జాయ్‌సన్‌మేఘా సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ఆధునిక వెల్‌నెస్ కేంద్రం, ద్రాక్ష నుంచి మద్యం తయారీ యూనిట్, అటవీ ప్రాంతంలో సఫారీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. మహింద్రా సంస్థ ఆధ్వర్యంలో నీటి కనిష్ట ప్రాంతంలో విశ్రాంతి కేంద్రాలు, పంచనక్షత్ర హోటళ్లు, టైర్ 2 నగరాల్లో జింజర్ హోటళ్లు, అలాగే నాగార్జునసాగర్‌లో వెల్‌నెస్ రిట్రీట్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. తైవాన్‌లోని ఫో గువాంగ్ షాన్ సంస్థ బుద్ధవనాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందాలు కుదరనున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ.15,000 కోట్లు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండటంతో సుమారు 50,000 మందికి నేరుగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



**పర్యాటకుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ రైళ్లు, బస్సులు, ఇతర రవాణా సౌకర్యాల కోసం సంబంధిత సంస్థలతో ఒప్పందాలు కుదరించారు. పర్యాటకులు ఉపయోగించే డిజిటల్ పర్యాటక కార్డులు ద్వారా ఆలయాలు, రవాణా, హోటళ్లలో రాయితీలు పొందగలరు. అదేవిధంగా హుస్సేన్ సాగర్‌లో 120 సీట్ల సామర్థ్యమున్న డబుల్ డెక్కర్ పడవను ప్రభుత్వం ప్రారంభించనుంది.ఈ ప్రయత్నాల ద్వారా తెలంగాణ పర్యాటక రంగాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్ళడం, యువతకు ఉద్యోగ అవకాశాలను విస్తరించడం, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది.**

చలన చిత్రాల నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేకంగా ఫిల్మ్ తెలంగాణ నెట్‌వర్క్‌ను ప్రారంభించనున్నారు. నిర్మాణాలకు అనుమతులు ఒకే స్థలంలో సులభంగా లభిస్తాయి, అవసరమైతే తక్షణ అనుమతులు కూడా అందిస్తారు.

అలాగే, వైద్య పర్యాటకం విభాగంలో కేంద్రం నుండి మంజూరు పొందిన నెట్‌వర్క్ ద్వారా విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు ఆసుపత్రులు, వైద్య సేవలు, బీమా, వీసా, భాషా సహాయం వంటి అన్ని వివరాలను పొందగలరు.

రాష్ట్రం హెలికాప్టర్ ద్వారా పర్యాటకులకు ప్రత్యేకంగా తిరగడానికి సేవలను ప్రారంభించింది. ప్రారంభంలో హైదరాబాద్ నుంచి సోమశిల, శ్రీశైలం వరకు సేవలు అందించనున్నారు. పర్యాటకుల ఆదరణను బట్టి ఈ సేవలను మరింత విస్తరించనున్నారు. తెలంగాణ వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ప్రాంతాల వారీ ప్రత్యేక మ్యాప్‌లు రూపొందించారు. ప్రత్యేకంగా హైదరాబాద్ బిర్యానీ, సర్వపిండి, సకినాలు వంటి వంటకాలను ప్రచారం చేయనున్నారు.

# ఏం చేసుకుంటారో చేస్కోండి


- నా అరెస్టుపై కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారు
- చూసి చూసి వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయి
- కేటీఆర్




హైదరాబాద్, సెప్టెంబరు 26 (తెలంగాణ ముచ్చట్లు):

కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు. తన అరెస్టుపై కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. చూసి చూసి వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఎల్ అండ్ టీ సంస్థపై మీడియాతో మాట్లాడిన సందర్భంగా కేటీఆర్ అరెస్టుపై ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఈ విధంగా బదులిచ్చారు. రేవంత్ రెడ్డి ఏం చేసినా దాని వెనుకాల ఓ స్కీమ్ ఉంటది..దాని వెను కాల ఓ స్కాం ఉంటుంది. ఇది పక్కా.. ఆయన పేరుకే ముఖ్యమంత్రి కానీ ఆయన దందా బ్లాక్ మెయిల్.

మిగతా 2లో..



# చెర వీడి చెరువైన బతుకమ్మ కుంట

- జాతీయ స్థాయిలో బతుకమ్మకుంట వైభవం
- ఈ నెల 26న సీఎం చేతులమీదుగా ప్రారంభం
- బతుకమ్మ ఉత్సవాలకు సర్వం సన్నద్ధం
- సర్వాంగ సుందరంగా మారిన బతుకమ్మ కుంట



హైదరాబాద్, సెప్టెంబరు 26 (తెలంగాణ ముచ్చట్లు):

బతుకమ్మకుంట తన పేరును సార్థకం చేసుకుంది. కబ్జాల కోరల్లో చిక్కుకున్న చెరువు నేడు జీవం పోసుకుంది. ముళ్ల పొదలు.. పిచ్చి మొక్కలతో అటువైపు చూడాలంటేనే భయపడే విధంగా ఉన్న బతుకమ్మ కుంట.. నేడు జలకళతో చూడముచ్చటగా తయారయ్యింది. కబ్జాల చెరను విడిపించుకుని కనువిందు చేస్తోంది. ఆక్రమణల నుంచి బయట పడి ఆహ్లాదంగా మారింది. ఇలా జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. ఇదంతా హైడ్రా చొరవతోనే సాధ్యమైందని అక్కడి నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్వాంగ సుందరంగా మారిన చెరువును చూసి ఇది కలా.. నిజమా అని సంబర పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పానికి, హైడ్రా పని తీరుకు బతుకమ్మ కుంట నిదర్శనమంటున్నారు. ఈ నెల 26న బతుకమ్మ కుంట ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డికి బతుకమ్మలతో ఘన స్వాగతం చెప్పేందుకు అక్కడి నివాసితులు సిద్ధమయ్యారు.

హైడ్రాకు ప్రేరణగా నిలిచిన బతుకమ్మకుంట.. జలకళతో.. జీవ వైవిధ్యంతో.. చక్కటి పర్యావరణంతో ఆరోగ్యవంతమైన జీవనం సాగించేలా ఈ నగరాన్ని తీర్చి దిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికై ఎలా ముందుకు వెళ్లాలి అని ఆలోచించే క్రమంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారికి తట్టిన ఆలోచనే హైడ్రా.

మిగతా 2లో..

# అసెంబ్లీ స్పీకర్‌తో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ..

హైదరాబాద్, సెప్టెంబరు 26 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు ఇవాళ (శుక్రవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులకు ఇప్పటికే కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు వివరణ ఇచ్చారు. అయితే, ఈ నెల 30వ తేదీ వరకూ కడియం శ్రీహరి గడువు కోరారు. ఈనెల 29 నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యక్ష విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ 6వ తేదీ నుంచి 23వ తేదీ వరకు విదేశీ పర్యటనకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెళ్లనున్నారు. విదేశీ పర్యటనకు ముందే ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంపై విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.




# జర్నలిస్టుల అక్రిడేషన్ల గడువు మరోసారి పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబరు 26 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు ఐ అండ్ పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 30వ తేదీతో ముగియనున్న అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయలేదు. గత 22 నెలలుగా అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని ప్రతి మూడు నెలలకు ఒకసారి పొడిగిస్తూనే ఉంది. అక్రిడేషన్ కార్డుల గడువు పొడిగించడం ఇది ఆరోసారి కావడం గమనార్హం.

# భారీ వర్షాలతో ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది

- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటోంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 26 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో రెండు రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరించింది.

మిగతా 2లో..



శనివారం-27- సెప్టెంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# చెర వీడి చెరువైన బతుకమ్మ కుంట

(మొదటి పేజీ తరువాయి)

జులై 19వ తేదీ 2024లో హైడ్రా ఆవిర్భవించింది. ఆరంభం నుంచే తన మార్కును చాటుతూ.. నగర భవిష్యత్తుకు బాటలు వేస్తున్న హైడ్రాకు బతుకమ్మ కుంట ప్రేరణగా నిలిచింది. వరద నివారణకు బతుకమ్మ కుంట బాటలు వేసింది. నగరవ్యాప్తంగా చెరువులు అభివృద్ధి చెందితే వరదలు చాలావరకు నివారించవచ్చునని బతుకమ్మ కుంట నిరూపించిందని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు తెలిపారు. వర్షం పడితే బతుకమ్మకుంట పరిసరాలు నీట మునిగేవి. ఈ వర్షాకాలంలో బతుకమ్మ కుంటలోకి వరద నీరు చేరడంతో ముంపు సమస్య తప్పింది. కేవలం 5 నెలల్లో బతుకమ్మకుంటను రూపొందించమని చెప్పారు. ఒకప్పటి ఎర్రకుంటనే.. కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందన్నారు.

వివాదాలనుంచి బయటపడి..

నిర్మాణ వ్యర్థాలతో చెరువును పూడ్చేసి ..ఈ చెరువ 8ఉ ఆనవాళ్లు లేకుండా కబ్జారాయుళ్లు ఆక్రమించేశారు. ఆ భూమికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకుండా కేవలం అన్ రిజిస్టర్డ్ అగ్రిమెంట్‌తో యెడ్ల సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బతుకమ్మకుంటను హైడ్రా చేపట్టింది. రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీతో కలిసి చెరువు చరిత్రను తవ్వి తీసింది. అన్ని విభాగాలతో కలిసి అనేక సమావేశాలు ఏర్పాటు చేసి బతుకమ్మ కుంట చెరువే అని నిర్ధారించుకుంది. బతుకమ్మ కుంట పునరుద్ధరణ ప్రక్రియలో అనేక న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంది, ముఖ్యంగా భూ కబ్జాదారులైన సయ్యద్ ఆజం, సయ్యద్ జహాంగీర్ మరియు ఏ. సుధాకర్ రెడ్డి లాంటి వారిచే వేసిన పిటిషన్లపై కోర్టులు పదేపదే ఇది చెరువు భూమియేనని స్పష్టం చేశాయి.

బతుకమ్మకుంట బతికే ఉందని రుజువైంది.. మండు వేసవిలో దాదాపు రూ. 7.15 కోట్లతో బతుకమ్మ కుంట పనులను హైడ్రా చేపట్టింది. జేసీబీలతో మోకాలు లోతు తవ్వగానే గంగమ్మ తల్లి ఉబికి వచ్చింది. బతుకమ్మ కుంట బతికే ఉందని రుజువు చేసింది. అక్కడి స్థానికులలో ఆనందం పెల్లుబికింది. బతుకమ్మ కుంట కాదు.. ఇది మా స్థలమంటూ ఇప్పటివరకూ నమ్మబలికిన వారిని ఇప్పుడేమంటారు అని అక్కడి స్థానికులు ప్రశ్నించారు. ఈ మేరకు అక్కడి ముళ్ల పొదలను తొలగించి... తవ్వకాలు చేపట్టిన హైడ్రాకు గంగమ్మ స్వాగతం పలికింది. అంబర్‌పేట మండలం, బాగ్అంబర్‌పేట్‌లోని సర్వే నంబరు 563లో 1962 63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణం అని తేల్చిన సర్వే అధికారులు. తాజా సర్వే ప్రకారం అక్కడ మిగిలిన భూమి కేవలం 5.15 ఎకరాల విస్తీర్ణం మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం మిగిలి ఉన్న 5.15 ఎకరాల విస్తీర్ణంలోనే బతుకమ్మ కుంటను పునరుద్ధరించింది.

# ఏం చేసుకుంటారో చేస్కోండి

(మొదటి పేజీ తరువాయి)

ఇవాళ చెప్పింది చిన్న విషయం.. ఇంకో నాలుగైదు రోజుల్లో ఒక పెద్ద విషయం కూడా చెబుతాను. ఇంకో కార్పొరేట్ సంస్థను ఎట్ల బ్లాక్ మెయిల్ చేశాడో అది కూడా చెప్తాను. ఆధారాలతో సహా చెప్తాను అని కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారు. వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయి. మమ్మల్ని అరెస్టు చేసుకుంటారా.. ఏం చేసుకుంటారో చేస్కోండి.. నేను ఏ తప్పు చేయలేదు. ఎంత ధైర్యం ఉంటే.. నేను ఒక మంత్రిగా పదేండ్లు పని చేశాను.. లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధమని చెప్పాను. సీఎంను అడిగాను.. ఆయన స్పందించలేదు. ఏసీబీ కేసు ఇద్దరి మీద ఉంది.. మీ కెమెరాల ముందే లైడిటెక్టర్ టెస్ట్ తీసుకుంటా రండి అని చెప్పాను. ఇప్పుడు కూడా అదే ఆఫర్ ఇస్తున్నా.. నేను తప్పు చేయలేదు కాబట్టి నిజాయితీకి ధైర్యం ఎక్కువ.. నేను తప్పు చేయలేదు కాబట్టి నాకు ఆధైర్యం ఉంది. అరెస్టు చేసుకుంటారా..? ఏం చేసుకుంటారో వదిలేయండి. నన్ను అరెస్టు చేస్తే పైశాచిక ఆనందం వస్తుండొచ్చు సీఎం రేవంత్ రెడ్డికి అది కూడా ఒకే. కానీ మేం కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టం.. 4 వేల పెన్షన్.. తులం బంగారం, స్కూటీ ఇవన్నీ ఇచ్చేదాకా కాంగ్రెస్ ను వెంటాడుతూనే ఉంటాం.. నీవెన్ని డైవర్షన్ గేమ్‌లు ఆడినా మేం వదిలిపెట్టం కాంగ్రెస్ పార్టీని అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నంలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లిలో ఏఎస్పీగా పనిచేశారు. అనంతరం గ్రేహౌండ్స్ స్క్వాడ్రన్ కమాండర్‌గా, బెల్లంపల్లి, ఆదిలాబాద్, నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో ఎస్పీగా సేవలందించారు. డీఐజీ ఎస్ఐబీగా పనిచేసిన సమయంలో మావోయిస్టుల అణచివేతలో కీలకపాత్ర పోషించారు.

2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. 2016లో నయీం ఎన్‌కౌంటర్ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. ఐక్యరాజ్యసమితి శాంతి బలగాల్లో భాగంగా కొసావో మిషన్‌లో కూడా సేవలందించారు. నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు ఎస్పీగా పనిచేసిన సమయంలో పలు ముఖ్యమైన కేసులను పర్యవేక్షించారు. 2007లో మక్కా మసీదులో జరిగిన పేలుళ్లు, పోలీసు కాల్పుల అనంతరం హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా నియమితులై, ఉద్రిక్త పరిస్థితుల్లో శాంతి భద్రతలను కాపాడారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా పని చేసిన సమయంలో రోడ్ భద్రతపై ప్రత్యేక ప్రచారం చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏసీబీ అడిషనల్ డైరెక్టర్, డైరెక్టర్‌గా, అనంతరం పర్సనల్ వింగ్ ఐజీగా, అడిషనల్ డీజీగా కూడా పనిచేశారు. రోడ్ సేఫ్టీ విభాగంలోనూ అనుభవం ఉంది.

2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమితులయ్యారు. గ్యాలంట్రీ మెడల్, పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్, ఐక్యరాజ్యసమితి మెడల్‌తో పాటు అనేక అవార్డులు అందుకున్నారు.



# భారీ వర్షాలతో ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గారు, డీజీపీ జితేందర్ గారితో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉంటూ ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. గడిచిన 24 గంటల్లో భారీ వర్షాలు కురిసిన రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలు, రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశాం. ఇరిగేషన్, రవాణా, విద్యుత్, హైడ్రా, జీహెచ్ఎంసీ, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేసి జన జీవనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించాము.



వికారాబాద్ జిల్లాలో కురిసిన అతిభారీ వర్షాల వల్ల మూసీ నదిలోకి భారీ వరద వస్తుండడంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించాము. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న55 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మూసీ నదిలో నీటి ఉధృతి పెరుగుతున్ననేపథ్యంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణలోనే ఉండాలని సూచించాము.

హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలకు వస్తోన్న వరదను ముందుగానే అంచనా వేసి అంతే పరిమాణంలో ఈ రెండు జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైతే షెల్టర్ హోమ్‌లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించాము.

ఇప్పటికే రాష్ట్రంలో చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండాయి. రాబోయే వర్షాల వల్ల చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే లోలెవెల్ కాజ్‌వేలు వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలి. జలాశయాలు, జల వనరుల వద్ద సెల్ఫీలు దిగకుండా యువతను నివారించాలి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రెస్క్యూ ఆపరేషన్ టీమ్ లు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించాలని అధికారులకు సూచించడం జరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

# బీసీలకు 42 % రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

సీఎస్, డీజీపీ, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం జరిపి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించనున్నారు. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు కల్పించిన ఈ అధిక రిజర్వేషన్లు రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు ఇతర వర్గాల రిజర్వేషన్ శాతం తగ్గుతుందా అన్న అంశంపై కూడా చర్చ సాగుతోంది. మొత్తంగా ఈ జీఓ బీసీలకు ఒక పెద్ద విజయంగా నిలుస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక మలుపు తీసుకురానుందని భావిస్తున్నారు.

## జూబ్లీహిల్స్ బరిలో బీఆర్ఎస్ అభ్యర్థిగా


# మాగంటి సునీత

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు బీఆర్ఎస్ అభ్యర్థి ఖరారు
- దివంగత మాగంటి గోపీనాథ్ అర్థాంగి సునీతకు టికెట్
- మాగంటి సేవలకు గుర్తింపుగా కుటుంబానికే అవకాశం

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికలో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థిని బీఆర్ఎస్ ఖరారు చేసింది. దివంగత సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అర్ధాంగి మాగంటి సునీతను అభ్యర్థిగా నిలబెడుతున్నట్లు పార్టీ అధినేత కేసీఆర్ అధికారికంగా ప్రకటించారు. మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీలో సీనియర్ నేతగా, నియోజకవర్గ ప్రజల మన్నలు పొందిన గోపీనాథ్ కుటుంబానికే ప్రాధాన్యత ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించింది. పార్టీకి, జూబ్లీహిల్స్ ప్రజలకు మాగంటి గోపీనాథ్ అందించిన సేవలను గౌరవిస్తూ, ఆయన భార్యకు టికెట్ కేటాయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడిరచాయి. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఈ నిర్ణయం ద్వారా మాగంటి గోపీనాథ్ కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందనే బలమైన సంకేతాలను పంపినట్లయింది.





# హైదరాబాద్‌లో వర్షం కారణంగా మూసారాంబాగ్ బ్రిడ్జి మూసివేత

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మరోసారి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో భారీగా కురిసిన వానతో నగర వాసులు తడిసి ముద్దయ్యారు. వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బేగంబజార్, కోఠి, నాంపల్లి, హిమాయత్ నగర్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీటితో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం వల్ల మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి మూసీ వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూసారాంబాగ్ బ్రిడ్జిపైకి వాహనాలను.. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. భారీ వర్షాలకు ఉస్మాన్ సాగర్ నిండిపోవడంతో పైనుంచి నీటిని దిగువ ప్రాంతాలకు వదలడంతో అంబర్‌పేటలోని మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జిపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను గోల్నాక కొత్త బ్రిడ్జి వైపు దారి మళ్లించారు. ఎగువన కురుస్తున్న కుండపోత వర్షాలతో జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ లోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఈసా, మూసీ నదుల నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవాహం జంట జలాశయాల్లోకి చేరడంతో అవి నిండుకుండలా మారాయి. గంటగంటకు వరద పెరుగుతుండటంతో జలమండలి అధికారులు రెండు జలాశయాల గేట్లను ఎత్తి మూసీలోకి వదులుతున్నారు. సాయంత్రం 4 గంటల వరకు ఉస్మాన్ సాగర్ 11 గేట్లు 7 ఎడుగుల మేర ఎత్తి 7,986 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. హిమాయత్ సాగర్ ఆరు గేట్లు మూడు అడుగుల మేర ఎత్తి 6,103 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మూసీలో వరద ప్రవాహం ఎక్కువైంది. నార్సింగి మంచిరేవుల వద్ద రహదారిపై వరద నీరు పోటెత్తడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. పురానాపూల్, చాదర్ ఘాట్, ముసారాంబాగ్ వద్ద మూసీ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మూసీకి వరద పోటెత్తడంతో పరివాహక ప్రాంతాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అఫ్జల్ గంజ్ వద్ద శివాజీ వంతెన కింద భూలక్ష్మి ఆలయ సమీపంలో నివసిస్తున్న 55 కుటుంబాలను గోడెకిఖబర్ ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్లోకి తరలించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షాలతోపాటు మూసీలో వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులతో సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే జలమండలి ఎండీ కూడా జంట జలాశయాల్లో వరద నీటి విడుదలపై వివరాలు ఆరా తీస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. వచ్చే రెండు రోజులపాటు జలమండలిలో సిబ్బంది, అధికారులకు సెలవులు రద్దు చేసినట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. సెలవులో ఉన్న ఉద్యోగులంతా వెంటనే విధుల్లోకి చేరాలని ఆదేశించారు.

# పెద్దమందడి–ఖిల్లా ఘణపురం అన్నదాతలకు కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డ్

◆ ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెద్దమందడి,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):

పెరుగుతున్న వ్యవసాయం, పంటల దిగుబడులు, అన్నదాతల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వనపర్తి నియోజకవర్గ పరిధిలో కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిర్మాణం కోసం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అభ్యర్థన మేరకు సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఖిల్లా ఘణపురం, పెద్దమందడి మండలాలకు సంబంధించి నూతన వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిర్మాణానికి అనుమతులు జారీ చేసింది (జీవో ఎంఎస్ నం. 121).
ఈ మార్కెట్ యార్డ్ నిర్మాణంతో పెద్దమందడి, ఖిల్లా ఘణపురం మండలంలోని అన్నదాతల ఇబ్బందులు తీరనున్నాయి. త్వరలో రిజర్వేషన్ల ప్రాతిపదికన మార్కెట్ యార్డుకు సంబంధించిన కమిటీ ఏర్పాట్లు జరుగనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్మాణానికి సహకరించిన ఇంచార్జ్ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహా, జిల్లా మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# లాభాల వాటా ప్రకటించడం పట్ల హర్షం: ఐఎన్టీయూసీ

◆ సీఎం, రాష్ట్రమంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం.

సత్తుపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):

సత్తుపల్లి పట్టణం సింగరేణిలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులకు ఈ ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల నుండి మెరుగైన వాటా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యానికి కృతజ్ఞతగా శుక్రవారం జే.వి.ఆర్ ఓసి లో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలోకృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతికుమార్ హాజరయ్యారు.



ఆయన మాట్లాడుతూ, కార్మికుల పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ ల చిత్రపటాలకు కార్యకర్తలు, ఉద్యోగులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి లాభాల కోసం శ్రమించిన కార్మికుల కుటుంబాల్లో ఆనందం నింపిన ఈ లాభాల ప్రకటనను కార్మిక వర్గం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది అన్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు తో పాటు కార్మికుల తరపున అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు నాగప్రకాశ్, సీతారామరాజు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, ఐ.వి. రెడ్డి, నాయకులు రషీద్, దావూద్, మురళి, గౌస్, రాజు, శ్రీనివాసరావు, ఏవి రావు, కిషన్ రావు, రామచందర్, నరేందర్, పొట్టి కిరణ్, బిచ్చు, వంశి రెడ్డి తదితర ముఖ్య నాయకులు, ఉద్యోగులు, డి.ఎల్.ఆర్ కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

2పాలకుర్తి , సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు) :

భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల పాలకుర్తి తెగువ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన నిప్పుకణిక, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన వీర వనిత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన పాలకుర్తి మార్కెట్ చైర్పర్సన్ లావుడియా మంజుల భాస్కర్ నాయక్, పాలకుర్తి బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జలగం కుమార్, పాలకుర్తి గ్రామ అధ్యక్షులు కమ్మగాని నాగన్న, మాజీ సర్పంచ్ పోగు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వీరమనేని



యాకాంతరావు, ఎస్టి సెల్ మండల అధ్యక్షుడు లావుడియా భాస్కర్ నాయక్, వి ఆర్ ఫౌండేషన్ మోలుగురి యాకన్న పన్నీర్ వెంకన్న, మాజీ వార్డ్ నెంబర్ పెనుగొండ రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారగని ఎల్లయ్య, యువ నాయకులు గడ్డం బాబు, తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# తెలంగాణ భవన్ లో చాకలి ఐలమ్మకు నివాళులు

నాచారం, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు)

సామాజిక సమానత్వం, న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్సీ ఎల్. రమణ అన్నారు. నిస్సహాయుల పక్షాన నిలబడి చేసిన ఆమె త్యాగాలు, పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు.తెలంగాణ భవన్లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ ఉద్యమంలో అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె పోరాటం నేటికీ ప్రేరణగా నిలుస్తోందని రమణ అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వరరావు, విట్టల్ యాదవ్, భూపాల్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, మధుకర్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి వేడుకల్లో వైభవం

◆ శ్రీ సాయి ఆంజనేయ స్వామి దేవాలయం కుంకుమార్చనలో మహిళా భక్తులు

నాగారం, సెప్టెంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు):

నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు ఎస్వి నగర్ కాలనీ రోడ్ నెం.7లోని శ్రీ సాయి ఆంజనేయ స్వామి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి (దసరా) ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల ఐదో రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక మాజీ కౌన్సిలర్ కోమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి, మహిళా భక్తులతో కలిసి ప్రత్యేక కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు దారూరి హరికృష్ణమాచార్యులు



పూజ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి, మంజుల, శాంతి, లలిత, సుమలత, అనురాధ, సునీత, శ్యామల, ప్రత్యూష, శ్రీదేవి, భాగ్యలక్ష్మి తదితర భక్తులు,

# చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

◆ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్

చిల్కానగర్, సెప్టెంబర్ (తెలంగాణ ముచ్చట్లు)

ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్లోని రాఘవేంద్ర నగర్ కాలనీలో తెలంగాణ ఉద్యమ వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహం లాంఛనంగా ఆవిష్కరించబడింది. ఈ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మరియు కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, "చాకలి ఐలమ్మ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి. ఆమె ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని చెప్పారు. కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, చిలుక నగర్ డివిజన్లో రజక సామాజిక వర్గానికి చెందిన అనేక కుటుంబాలు



నివసిస్తున్నాయని, వారు ఐలమ్మ ఆశయ సాధనలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా పాత్రధారులుగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ బాధ్యులు రాగిడి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, తెలంగాణ మడేలయ్య రజక సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

◆ ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 26, తెలంగాణ ముచ్చట్లు;

శుక్రవారం చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో మధిర నియోజకవర్గ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిపార్స్ మేరకు నాగిలిగొండ గ్రామానికి చెందిన షేక్ నజీమా 20వేల రూపాయలు, ఎర్రిబోయిన. సావిత్రి 27,500 కోసూరి నిర్మల 28,500 రూపాయలను వివిధ అనారోగ్య కారణాల చేత వివిధ హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పగడాల రాధాకృష్ణమూర్తి ఉపాధ్యక్షుడు చాట్ల రాజశేఖర్ కోశాధికారి పంది మురళి మాజీ సర్పంచ్ జమ్ముల కృష్ణారెడ్డి కిసాన్ సెల్ అధ్యక్షుడు మధ్ధిని.లక్ష్మయ్య సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏపూరి సత్యం, గడ్డం రామారావు ,జమ్మల అశోక్ రెడ్డి పంది వీరభద్రం ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరికొట్ల బాలశౌరి ఇమ్మడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



# కురుస్తున్న వర్షాల దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండాలి

◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచనలు

వనపర్తి,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వనపర్తి నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు.
అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రయాణాలు చేయరాదని ఆయన పేర్కొన్నారు.
మట్టి మిద్దెల్లో, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారు తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్చరించారు. వాగులు, వంకలు దాటేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.
వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు సహకరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో నేరుగా తనను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: ఎమ్మెల్యే: 9494216666 జిల్లా కలెక్టర్ కార్యాలయం కంట్రోల్ రూమ్: 08545 220351, 08545233525 ప్రజల భద్రతే తనకు ముఖ్యమని, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రజలను కోరారు.



# మల్కాజిగిరి సీనియర్ జర్నలిస్ట్ మండే సురేష్ కు టిడబ్ల్యూజేఎఫ్ ఘన నివాళులు

మల్కాజిగిరి, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు) :

మల్కాజిగిరి సర్కిల్ వినాయక్ నగర్ డివిజన్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మండే సురేష్ గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందడం పట్ల పత్రికారంగం విషాదంలో మునిగిపోయింది. శుక్రవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి షేక్ సలీమా, రాష్ట్ర కమిటీ సభ్యులు హరి ప్రసాద్, జిల్లా నాయకులు పబ్బు మల్లేష్ గౌడ్, మల్కాజిగిరి కార్యదర్శి సత్యం, సుధాకర్, సురేష్ సాగర్ తదితరులు సురేష్ భౌతిక కాయానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పత్రికా రంగంలో సేవలందించిన ఆయన, స్థానిక సమస్యలను ప్రజా వేదికపైకి తీసుకువచ్చిన తీరు అమరమైనదని కొనియాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తిత్వం ఆయనదని గుర్తుచేశారు. ఆయన మరణం జర్నలిస్టు వర్గానికి భర్తీ కాని లోటని తెలిపారు.జిల్లా నాయకుడు పబ్బు మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ - "సురేష్ ఎల్లప్పుడూ మిత్ర సహృదయంతో మెలుగుతూ, సమాజ సమస్యలను అక్షరబాణాలతో ప్రతిబింబించేవారు" అని అన్నారు.మల్కాజిగిరి జర్నలిస్టులు ఆయన పత్రికా జీవితం, సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రజా పోరాటాలకు స్ఫూర్తి చాకలి ఐలమ్మ

◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి,

వనపర్తి,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ఉద్యమకారిణి, తొలి భూపోరాటానికి నాంది పలికిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె వీరత్వాన్ని ఆయన స్మరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనపర్తి పట్టణంలోని బస్టాండ్ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు అర్పించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ, అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా 'దొరా' అని పిలిపించుకునే సంస్కృతి



కి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ప్రథమురాలు అని అన్నారు. ప్రజా పోరాటాలకు ఆమె స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిజె. శ్రీనివాస్, లక్కాకుల సతీష్, మాజీ కౌన్సిలర్లు వెంకటేష్, చీర్ల సత్యం, బ్రహ్మంచారి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణ, శ్రీహరి రాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా కట్ట ఎల్లేష్‌కు వైద్య సాయం అందజేత

నాచారం, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):



ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్‌కు చెందిన కట్ట ఎల్లేష్ అనారోగ్యంతో ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం పొందిన సమయంలో వచ్చిన వైద్య ఖర్చును సాకారం చేయడానికి సీఎంఆర్ఎఫ్ ద్వారా 60,000 రూపాయల చెల్లింపును మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆర్థిక సహాయంగా అందించారు.శుక్రవారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఆర్థిక సాయం చెక్‌ను కట్ట ఎల్లేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ మరియు భాను కూడా పాల్గొన్నారు.కట్ట ఎల్లేష్ కుటుంబం ఎమ్మెల్యే మరియు స్థానిక కార్పొరేటర్ పై కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి... బహుమతులు పొందండి.

- దసరా పండుగ సందర్భంగా లక్కీడిప్ – తొలి బహుమతి రూ.25 వేల నగదు.
- సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత.



**సత్తుపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు ప్రత్యేక బహుమతుల వర్షం కురిపించనుంది. డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ఎసి, అన్ని రకాల ఏసి బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీడిప్ ద్వారా ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత తెలిపారు.

సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6 వరకు ఏ రోజైనా బస్సుల్లో ప్రయాణించిన టికెట్ వెనుక ప్రయాణికులు తమ పేరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన లక్కీడిప్ బాక్సుల్లో వేసుకోవాల్సి ఉంటుందని ఆమె వివరించారు.

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు, ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ పర్యవేక్షణలో సత్తుపల్లి, వి.ఎం. బంజర, కల్లూరు, అశ్వరావుపేట బస్టాండ్లలో లక్కీడిప్ బాక్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రీజియన్ స్థాయిలో మూడు ప్రధాన బహుమతులను అందజేయనున్నట్టు వెల్లడించారు. అందులో మొదటి బహుమతి రూ.25 వేల నగదు, రెండో బహుమతి రూ.15 వేల నగదు, మూడో బహుమతి రూ.10 వేల నగదు అని వివరించారు. దసరా సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని సునీత సూచించారు.






# పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

**చాకలి ఐలమ్మకు నివాళులర్పించిన ఎంపీ కావ్య**

**చాకలి ఐలమ్మ స్ఫూర్తి ప్రదాత**

**వరంగల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ధీర వనిత, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి హంటర్ రోడ్, న్యూ శాయంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, "చాకలి ఐలమ్మ పోరాట యోధురాలు. ఆమె అనేక మందికి స్ఫూర్తినిచ్చింది. తెలంగాణ ధైర్యాన్ని, పోరాట పటిమను దేశానికి, ప్రపంచానికి చాటిచెప్పింది. ఆమె చూపిన బాటలో నడుస్తూ తెలంగాణ మహిళలను శక్తివంతులను చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు.

తరువాత మాచిదేవ ట్రస్ట్ భవన్ను ఎంపీ ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి కూడా పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని పలువురు గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, హనుమకొండ, వరంగల్ అదనపు కలెక్టర్లు వెంకటరెడ్డి, సంధ్యారాణి, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.



# పుట్టు పంచ కార్యక్రమంలో చిన్నారులను ఆశీర్వదించిన మాజీ మంత్రి

**ఖిల్లా ఘనపూర్,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):** ఖిల్లా ఘనపురం మండలం సోలిపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నాయకుడు శానాయపల్లి రవీందర్ రెడ్డి కుమారుల పుట్టు పంచ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మార్కెట్ మాజీ కమిటీ వైస్ చైర్మన్ టీనేటి బానేశ్వర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాళ్ళ కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పులేందర్ రెడ్డి, జాత్రు నాయక్, మాజీ సర్పంచులు రామ్ రెడ్డి, పీన నాయక్, శేఖర్ రెడ్డి, శ్రీను నాయక్, రాఘవేంద్ర రెడ్డి, జయకర్ రెడ్డి, బెస్ట్ గోపాల్, ఆంజనేయులు గౌడ్, బాల్ రెడ్డి, కరీం, అంజిరెడ్డి, రాజారెడ్డి, దేవరశెట్టి మహేష్, జగదీశ్వర్ రెడ్డి, కేశవరెడ్డి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


క్రొత్త జీవితానికి అందమైన ప్రారంభాన్ని అందించడానికి ఈ కార్యక్రమం స్థానిక సామాజిక, రాజకీయ నాయకుల అనేక ప్రత్యేక ఆసక్తిని ఆకర్షించింది.

# హక్కుల కోసం నిరంతరం పోరాడాలి

**హసన్ పర్తి,సెప్టెంబర్ 26 ( తెలంగాణ ముచ్చట్లు):**

ఇటీవల విద్యుత్ ఉద్యోగిగా పదవీ విరమణ పొందిన దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు,ఎస్సీ,ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ ను ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ నేత ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి కృష్ణారెడ్డి, కార్యదర్శి సీనియర్ జర్నలిస్టు కన్నా పరశురాములు,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉదయం దిన పత్రికలో విలేఖరి గా పనిచేస్తూ ఎన్నో స్ఫూర్తిదాయకమైన వార్తలు రాసి ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని నిరంతరం ప్రజా సమస్యలపై రౌతు రమేష్ కలం పోరాడిందని కొనియాడారు.ఓవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే దళిత బహుజనుల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం పోరాడారని అన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా రౌతు రమేష్ కుమార్ ప్రజల్లో ఉండాలని కోరారు.



# శ్రీ మహంకాళి దేవాలయంలో ఘనంగా 33వ దసరా శరన్నవరాత్రుల పూజలు

**నాగారం, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

రాంపల్లి శ్రీ మహంకాళి దేవాలయంలో 33వ దసరా శరన్నవరాత్రుల పూజలు భక్తిపూర్వకంగా నిర్వహించబడాయి. గ్రామ పురోహితులు ప్రధాన అర్చకులుగా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాతకు భక్తులకు దర్శనం కల్పించారు.

శ్రీ మహంకాళి అమ్మవారిని శ్రీ స్కందా దేవి అలంకరణలో అలంకరించి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కందాడి శ్రీకాంత్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ భూమయ్య యాదవ్, కమిటీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి దంపతులను సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను విరాళంగా అందజేశారు.

సాయంత్రం మహిళలచే కుంకుమార్చన కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎలసాని భూమయ్య యాదవ్, ఉపాధ్యక్షులు మహేందర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి ఎల్లమయ్య, ఇతర కార్యవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# 15వ బెటాలియన్ లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**సత్తుపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం, బి గంగారం గ్రామంలో 15వ ప్రత్యేక పోలీసు పటాలములో శుక్రవారం నాడు చిట్యాల ఐలమ్మ 130వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి పటాలపు కమాండెంట్ ఎన్ పెదబాబు హాజరై చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమాండెంట్ ఎన్ పెదబాబు మాట్లాడుతూ, తెలంగాణ అంటేనే ఒక తెగువ పోరాటం అని అన్నారు. 1949 సంవత్సరంలో జరిగిన ప్రజా ఉద్యమం భారతదేశ చరిత్రలో ఒక కీలక ఘట్టమని చెప్పారు. ఆ సాయుధ పోరాటం ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని గుర్తుచేశారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన చాకలి ఐలమ్మ పోరాటం చూపించిన ధైర్యం సాయుధ పోరాటానికి స్ఫూర్తి నిచ్చిందని అన్నారు. అటువంటి మహనీయురాలి జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ వేడుకలకు అదనపు కమాండెంట్ ఏ అంజయ్య సహాయ దళాధిపతులు ఎస్ శ్రీధరరాజా, ఎస్ డి రంగారెడ్డి, ఆర్ ఐలు, ఆర్ ఎస్ ఐలు, పటాలపు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు





# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ పై వర్క్ షాప్

**సత్తుపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మండలం, బి గంగారం గ్రామంలో గల సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేధస్సు మరియు యంత్ర అభ్యాసం, కృత్రిమ మేధస్సు మరియు డేటా శాస్త్రం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మూడవ సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులకు కోసం రెండు రోజులపాటు "డేటా సైన్స్ వర్క్ షాప్" ను విజయవంతంగా నిర్వహించారు. ఈ వర్క్ షాప్ ను హైదరాబాద్ ఆధారిత స్వనాప్రో సంస్థ నిర్వహించింది. ఇందులో స్థాపకుడు కేసరి కార్తికేయరెడ్డి, ప్రధాన నిర్వాహక అధికారి ఇరుకుల్ల సాయితేజ, ప్రధాన కార్యనిర్వాహణ అధికారి శెట్టి రఘుచరణ్, నిర్వహణా సంచాలకుడు దగ్గుల స్యాంతన్ రెడ్డి, శిక్షణదారుడు తిప్పిరెడ్డి వేణుప్రకాష్‌రెడ్డి ముఖ్య శిక్షకులుగా పాల్గొని విద్యార్థులకు శిక్షణ అందించారు.

ఈ సందర్భంగా నిపుణులు డేటా సైన్స్, యంత్ర అభ్యాసం, కృత్రిమ మేధస్సు, డేటా విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై లోతైన అవగాహన కల్పించారు. విద్యార్థులు పరిశ్రమలో డేటా సైన్స్ ప్రాధాన్యత, వాస్తవ సమయ అనువర్తనాలు మరియు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై విలువైన జ్ఞానం పొందారు.

కార్యక్రమాన్ని కళాశాల ఉప ప్రిన్సిపాల్ మరియు కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ షేక్ యాకూబ్, అలాగే కృత్రిమ మేధస్సు మరియు యంత్ర అభ్యాసం, కృత్రిమ మేధస్సు మరియు డేటా శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ తోటకూర వీరన్న సమన్వయం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ, ఈ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో నూతన విజ్ఞానాన్ని పొందడం, పరిశ్రమలో ఆచరణాత్మక అనుభవాన్ని కలిగించడం మరియు భవిష్యత్ వృత్తి మార్గంలో ముందుకు సాగడానికి ఇది కీలకమని అభిప్రాయపడ్డారు.

కళాశాల కార్యదర్శి మరియు ప్రతినిధి దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ వర్క్ షాప్ విద్యార్థులలో సాంకేతిక అవగాహనను పెంపొందించడమే కాకుండా పరిశ్రమ అవసరాలకు తగిన నైపుణ్యాలను అందించడానికి దోహదపడుతుందని, కాలేజీ విద్యార్థుల భవిష్యత్ వృత్తిలో ఇది గొప్ప అవకాశమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వర్క్ షాప్ ను విజయవంతం చేశారు. చివరగా నిర్వాహకులు అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నాగారం మున్సిపాలిటీలో చాకలి ఐలమ్మ జయంతి

**నాగారం, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని నాగారం మున్సిపాలిటీలో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు.

జయంతి సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు అర్పించి, ఆమె సేవలను స్మరించుకున్నారు. మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ కుమార్, మేనేజర్ సురేష్ రెడ్డి, రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి. శ్రావణ్ కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రదీప్, ఎ. బాబు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొని ఐలమ్మ సేవలను కొనియాడారు.




# ఇందిరమ్మ ఇంటికి మూడో విడత బిల్లు మంజూరు

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 26, తెలంగాణ ముచ్చట్లు:** గోవిందాపురం ఏ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేడేపల్లి కోటేశ్వరావు (టీడీపీ) ఇందిరమ్మ ఇల్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేయగా ఇంటి నిర్మాణము పూర్తి దిశ కు చేరుకుంది. శుక్రవారం మూడవ బిల్లు 2 లక్షల రూపాయలు బ్యాంక్ అకౌంట్ లో పడ్డాయి. గతంలో రెండు సార్లు రెండు లక్షలు పడ్డాయి. మొత్తం నాలుగు లక్షల రూపాయలు బిల్లులు బ్యాంకులో పడ్డాయి. మేడేపల్లి కోటేశ్వరరావు తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి డిప్యూటీ సీఎం శ్రీ మల్లు భట్టి విక్రమార్క కి రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీ కర్నాటి రామకోటేశ్వరావు కి మండల పార్టీ అధ్యక్షులు దుర్గారావు కి పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కి కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాగం పాపారావు భాగం నాగేశ్వరరావు గండమాల రాయప్ప మొదలగు వారు పాల్గొన్నారు .







# హనుమకొండ జిల్లా అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

◆ పాల్గొన్న ఎంపి కడియం కావ్య

**హన్మకొండ,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో రైల్వే, మున్సిపల్, కుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లో వంతెనలు, పైపులైన్లు, రోడ్లు, తాగునీటి సమస్యలు, ఎఫ్‌సీఐ గోదాం, అంబేద్కర్ భవన్, వరదనీటి నిల్వ, భద్రకాళి దేవాలయం వద్ద పార్కింగ్ వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది.ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, అభివృద్ధి ప్రతిపాదనలను కేంద్రానికి తీసుకెళ్లి నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో కాజీపేట బస్టాండ్ అంశాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలిపారు. రైల్వేకు సంబంధించిన ఏ సమస్యలనైనా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారం కోసం రైల్వే అధికారులతో సమన్వయం చేస్తానని పేర్కొన్నారు.

ప్రాధాన్య ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, వరదనీరు నిల్వ సమస్యపై ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్యసేవలు అందించడానికి వరంగల్‌లో సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ మంజూరైనట్లు చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వ భవనం కేటాయిస్తే, త్వరలో సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు.రైల్వే, దేవాలయాలు, విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించినట్లయితే వాటిని సాధించేందుకు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్ఓ వైవీ గణేష్, ఆర్డీఓ రాథోడ్ రమేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించిన ఇమాన్యుయేల్ రాజ్

**స్టేషన్ ఘనపూర్,సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సింగపురం ఇందిర కుమారుడు ఇమాన్యుయేల్ రాజ్, పీచర గ్రామంలో మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు ఇంటిని సందర్శించారు. ఇటీవల ఆయన తల్లి సక్కుబాయి మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. సక్కుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఇమాన్యుయేల్ రాజ్, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వేలేరు మండల ఉపాధ్యక్షుడు పెద్ది నగేష్, స్టేషన్ ఘనపూర్ యూత్ ప్రధాన కార్యదర్శి కొలిపాక వెంకటేష్, కమ్మగోని ప్రభాకర్, నాగయ్య, బట్టు సాగర్, సింగపురం దయాకర్, సట్ల రవీందర్ గౌడ్, ఏల్ల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## మహవీర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ రెండు ప్రతిష్టాత్మక అవార్డులు గెలిచింది

◆ 19వ ఫెడరేషన్ ఆఫ్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ అవార్డ్స్ 2025లో ఉత్తమ కలెక్షన్స్, ఉత్తమ అడిట్ విభాగాల్లో బ్యాంక్ కి గౌరవం

**కాప్రా, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** 19వ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ బ్యాంక్స్ అవార్డ్స్ 2025లో మహవీర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ రెండు ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందని బ్యాంక్ చైర్మన్ అశోక్ కొఠారి తెలిపారు. దేశ వ్యాప్తంగా 1500 మంది బ్యాంకులు పాల్గొన్న పోటీలలో మహవీర్ బ్యాంక్ ఉత్తమ కలెక్షన్స్ మరియు ఉత్తమ అడిట్ విభాగాలు కోసం అవార్డులు పొందింది. అవార్డుల వేడుకలో చైర్మన్ అశోక్ కొఠారి, సీనియర్ వైస్ చైర్మన్ హరినారాయణ, ఎండి/సిఈవో విజయ్ కుమార్ చౌదరి, వైస్ చైర్మన్ మహవీర్ కొఠారి తదితరులు పాల్గొన్నారు.చైర్మన్ అశోక్ కొఠారి మాట్లాడుతూ, ఈ అవార్డులు బ్యాంక్ పై భాద్యతను మరింత పెంచాయని, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి కృషి కొనసాగిస్తామని తెలిపారు. బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది కృషి వల్లనే ఈ అవార్డులు సాధ్యమైందని కూడా పేర్కొన్నారు.వేడుకలో బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.






## రాజోలి–శాంతినగర్ రహదారి చెరువుగా మారిన వైనం

ధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**జోగులాంబ గద్వాల్,సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** రాజోలి మండల కేంద్రం నుండి శాంతినగర్ వైపు వెళ్లే రహదారి వర్షపు నీటితో గుంతలు నిండిపోయి చెరువులా మారింది. ఈ రహదారిని ఉపయోగించే గ్రామస్తులు, రోజువారీ ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రహదారి ఎటు వెళ్ళాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. చిన్నపిల్లల స్కూల్ బస్సులు కూడా సరిగా నడవలేక ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతున్నాయి.

“ఎటు వెళ్లాలో అర్థం కాక ప్రాణాలకు తెగించి ప్రయాణించాల్సి వస్తోంది. బస్సులు, ఆటోలు సరిగా నడవట్లేదు,” అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగభద్ర నది ప్రవాహం, రాజోలి రిజర్వాయర్ కారణంగా వర్షాకాలంలో రహదారులు మరింత దెబ్బతింటున్నాయని ప్రజలు చెబుతున్నారు. తక్షణం చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత విషమిస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.



## కలెక్టర్ ని కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్, సెప్టెంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు)** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరీ, ఐ.ఎ.ఎస్ ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి తో కలిసి మల్లాపూర్ డివిజన్ పరిధి లోని నేహ్రూనగర్ కాలనీకీ ఎదురుగా, ఎన్ఎఫ్సి కంపెనీ ప్రహరీగోడను అనుకోని ఉన్న టీఎస్ఐఐసి కీ సంబంధించిన మల్లాపూర్ గ్రామ సర్వే నెం 44, 45 లోని ఎన్ ఎఫ్ సి వారు వదిలినటువంటి నిరుపయోగంగా ఉన్న ఖాలీ స్థలము కబ్జాలకు గురవుతున్నది, ఇట్టి స్థలాన్ని అప్పట్లో టిఎస్ఐఐసి మౌలాలి ఐఏఎల్ఏ వారికీ ప్రభుత్వం వారు అప్పగించాడము జరిగింది అని ఆయన అన్నారు.ఇట్టి నిరుపయోగంగా ఉన్న ఖాలీ స్థలాన్ని ప్రభుత్వం వారు స్వాధీనం చేసుకొని స్థానిక కాలనీ వాసులకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాలు మరియు పార్కును అభివృధి చేస్తే స్థానిక ప్రజలకు చాల ఉపయోగకరంగా ఉంటుందని, స్థానిక ప్రజల కోరిక మేరకు తమరిని కోరడమైనది అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.ఎన్ఎఫ్సీ అనుకోని కడుతున్న ప్రవారీ గోడ నీ ఆపాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, ఆకుల మహేందర్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## వీరనారి ఐలమ్మ 130వ జయంతి విగ్రహానికి పూలమాల

**ఏ.ఎస్.రావు నగర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు వీరనారి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆమె విగ్రహం వద్ద సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ విగ్రహానికి సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, కృష్ణమాచార్యులు, గొడుగు యాదగిరిరావు, జయరాజు, నవతెలంగాణ రవి, సీనియర్ పాత్రికేయులు గుమ్మడి హరిప్రసాద్, ఎం.భాస్కర్ రావు, శారద తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ – “వీరనారి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమానికి నిప్పురవ్వను వెలిగించిన గొప్ప యోధురాలు. నిజాం సర్కారు పాలనలో దేశముఖ్ దౌర్జన్యాలకు ఎదిరించి తన భూమి, పంటను కాపాడుకోవడం గొప్ప పోరాటం. ఆమెకు కమ్యూనిస్టు నాయకులు బీమి రెడ్డి నరసింహారెడ్డి సాయుధ సహకారం అందించడంతో దేశముఖ్ గుండాలను తిప్పికొట్టగలిగారు. దొడ్డి కొమరయ్య బలిదానం, ఐలమ్మ పోరాటం తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రాణం పోశాయి” అని అన్నారు.అలాగే, ఈ పోరాట పటిమ వల్లే వేలాది ఎకరాలు రైతులకు దక్కాయని, వెట్టిచాకిరి నిర్మూలన జరిగిందని, తెలుగువారిని ఐక్యపరిచి భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు దోహద పడిందని గుర్తు చేశారు.తరువాత హాజరైన సభ్యులందరూ ఐలమ్మ విగ్రహానికి పుష్ప గుచ్చాలు సమర్పించి నివాళులర్పించారు. “వీరనారి ఐలమ్మకి జోహార్” నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు.ఈ కార్యక్రమంలో జయరాజ్, కృష్ణమాచార్యులు, గుమ్మడి హరిప్రసాద్, నవతెలంగాణ రవి, ఎం.భాస్కర్ రావు, శారద, వర్మ, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులులో పాల్గొన్న దయాకర్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 26, తెలంగాణ ముచ్చట్లు:** పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం అమ్మగూడెం గ్రామంలో నాలుగు కోట్ల రూపాయల తో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో రెవెన్యూ,గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లా క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి ని పరుగులు పెట్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో అమలు జరగడం లేదని ఆయన తెలిపారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పని చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్న పూసల సీతారాములు,మాజీ మార్కెట్ చైర్మన్ శాఖమూరి రమేష్,కాంగ్రెస్ జిల్లా నాయకులు కొడాలి గోవింద రావు,నంబూరి రామారావు,బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న,అడపాల రామారావు, రాయపూడి నవీన్,గుండా బ్రహ్మం,చిట్టెం చెట్టి వెంకటేష్,తేజావాత్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు



## అక్టోబర్ 18 లోపు మద్యం షాపుల వేలంలో పాల్గొనుటకు దరఖాస్తులు సమర్పించాలి...

◆ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ నాగేంద్ర రెడ్డి

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 26, తెలంగాణ ముచ్చట్లు;** నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా మద్యం షాపుల నిర్వహణకు ఆసక్తి గలవారు అక్టోబర్ 18 లోపు దరఖాస్తులు దాఖలు చేయాలని జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ జి. నాగేంద్ర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 202527 సంవత్సరానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 116 మద్యం షాపుల వేలం కొరకు స్వీకరించే దరఖాస్తులను అక్టోబర్ 18 వరకు స్వీకరించడం జరుగుతుందని, దరఖాస్తుదారుడు మూడు లక్షల రూపాయలను డిడి / చలాన్ రూపేన చెల్లించాలని, ఈ సొమ్ము తిరిగి చెల్లించబడవని అన్నారు. దరఖాస్తుదారుడు జిల్లా మద్యపాన నిషేధ అధికారి, ఖమ్మం పేరిట డిడి తీయాలని, దరఖాస్తు తో పాటు పాన్ కార్డు, ఆధార్ కార్డు సెల్ఫ్ సర్టిఫైడ్ కాపీ, కుల ధ్రువీకరణ పత్రం జత చేయాలని, దరఖాస్తులను ఖమ్మం కొత్త కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న ఎక్సైజ్ స్టేషన్ నందు సమర్పించాలని ఆయన తెలిపారు. మద్యం షాపుల దరఖాస్తులను ఖమ్మం లోని లేక్ వ్యూ ఫంక్షన్ హాల్ నందు అక్టోబర్ 23న ఉదయం 11.00 గంటలకు డ్రా ద్వారా కేటాయించడం జరుగుతుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

**ఏ ఎస్ రావు నగర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలో ఉన్న ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాయుధ పోరాటం చేసిన ధీరవనిత అని, భూస్వాముల అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన పోరాట యోధురాలు అని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. ఆమె ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, మాజీ కౌన్సిలర్ గడ్డమీధి రాములు యాదవ్, చక్రపాణి గౌడ్, టి.యన్.ఎస్.యప్ శివానంద్, రజక సంఘం నాయకులు శనిగరం అశోక్, కుమారస్వామి, సకినాల రవి, యాకయ్య, చల్లా ప్రభాకర్, చల్లా వెంకటేష్, కనకయ్య, కుమార్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.మీడియా మిత్రులు చంద్రమోహన్, చంద్రమౌళి, యవపురం రవి, యన్.యం.గౌడ్, నిరథ్ తదితరులు కూడా పాల్గొని చాకలి ఐలమ్మకు పుష్పాంజలి ఘటించారు.





# ఖమ్మం కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఖమ్మం బ్యూరో ,సెప్టెంబర్-26, తెలంగాణ ముచ్చట్లు:** తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బతుకమ్మ వేడుకలు కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఆరో రోజు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లో మార్కెటింగ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన అలిగిన బతుకమ్మ వేడుకలలో మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలలో భాగంగా ప్రత్యేకంగా బతుకమ్మలను పేర్చి గౌరమ్మ తల్లికి పసుపు కుంకమలతో పూజలు చేశారు. బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.... అంటూ ఆట, పాటలతో ఎమ్మెల్యే సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకుంటున్న బతుకమ్మ పండుగలో తొమ్మిది రోజులు రకరకాలుగా గౌరమ్మను కొలుచుకొంటూ, కలిసి కట్టుగా అందరూ ఒకేచోట చేరి ఆడుతూ, పాడుతూ బతుకమ్మను పూజించుకొంటారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, మద్దులపల్లి మార్కెట్ కార్యదర్శి ఆంజనేయులు, వైరా మార్కెట్ కార్యదర్శి మొహసీన్ సుల్తానా, మార్కెటింగ్ శాఖ సిబ్బంది రామకృష్ణ, సాదిక్, యశోద, పద్మ, శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గొడవర్తి రామారావు మృతి

**మాజీ ఎంపీ నామ సంతాపం**

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 26, తెలంగాణ ముచ్చట్లు;** ప్రముఖ వ్యాపారవేత్త, ఖమ్మం మార్కెట్ దిగుమతి శాఖ సీనియర్ సభ్యులు గొడవర్తి రామారావు మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. వారి ధర్మపత్ని గౌరమ్మ కాలం చేసి ఆరు నెలలు గడవకముందే రామారావు కూడా మృతి చెందడం ఇటు ఖమ్మం వ్యాపార రంగం తో పాటు వారి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపార, సేవారంగాల్లో చేసిన కృషిని కొనియాడుతూ, అనేక దశాబ్దాలుగా



వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేసి అందరితో కలివిడిగా మెలిగారని గుర్తుచేశారు. రామారావు ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.





## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన సింగపురం ఇమ్మానుయేల్

**వేలేరు,సెప్టెంబర్26(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బక్క రాజు కుమారుడు బక్క శివకుమార్ డెంగ్యూ జ్వరంతో ఈ నెల 24న మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సింగపురం ఇందిర కుమారుడు సింగపురం ఇమ్మానుయేల్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. పిన్న వయసులోనే డెంగ్యూ వ్యాధి బారినపడి మృతి చెందడం దయనీయమని ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తెల శ్రీకాంత్ యాదవ్, మాజీ ఎంపిటిసి బాల్లే వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు కమ్మగొని ప్రభాకర్ గౌడ్, బట్టు అంజయ్య, కర్రన్న మల్లయ్య, రాజిరెడ్డి, బాపిరెడ్డి, సాగర్, సతీష్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.



## నేరడలో సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 26, తెలంగాణ ముచ్చట్లు;** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు ఆర్థిక & విద్యుత్, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన వంకాయలపాటి మాధవరావు కు 30,000/వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన చెక్కును ఆయనకు అందజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మంకెన నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు చెవుల తిరుపతిరావు వంకాయలపాటి నరసయ్య వంకాయలపాటి అశోక్ దోమకొండ శ్రీను చెవుల వెంకటి కొల్లి శివకృష్ణ షేక్ సొందు దోమకొండ హుస్సేన్ తదితరులు ఉన్నారు





## అమ్మవారికి ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే సతీమణి మర్రి మమత రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి డివిజన్ పరిధిలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం మరియు శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయాలలో శ్రీ దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే సతీమణి మర్రి మమత రాజశేఖర్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉత్సవాల్లో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ నిర్గొండ మంజుల జగదీష్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించి ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా స్థానిక మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ మిలిటరీ దాడులు

గాజాపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 40 మందికి పైగా పాలస్తీనియన్లు మృతి చెందారు. వీరిలో పలువురు చిన్నారులు కూడా ఉన్నారు. ఇప్పటి వరకు క్షిపణిదాడులతో గాజాను అస్తవ్యస్తం చేసిన ఇజ్రాయిల్.. ఆ నగరంపై మిలిటరీ దాడులకు కూడా ఉపక్రమించిన విషయం విదితమే. అటు వైమానిక, ఇటు మిలిటరీ దాడులతో గాజాను తన గుప్పెట్లోకి తెచ్చుకొనే ప్రయత్నాన్ని ఇజ్రాయిల్ చేస్తున్నది. తాజాగా మధ్య, దక్షిణ గాజాపై ఇజ్రాయిల్ జరిపిన మిలిటరీ దాడుల్లో 43 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఇజ్రాయిల్ చర్యలను ఖండిస్తూ అంతర్జాతీయ సమాజం నుంచి చాలా ఒత్తిడి వస్తోంది. అయినప్పటికీ గాజాపై ఇజ్రాయిల్ తన దాడులను మాత్రం ఆపటం లేదు. దీంతో పదుల సంఖ్యలో అమాయకపు పాలస్తీనియన్లు మృతి చెందుతున్నారు. గాజాలో మారణహోమం సృష్టిస్తోన్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై యూఎస్ కేంద్రంగా పని చేసే కౌన్సిల్ ఆన్ అమెరికన్-ఇస్లామిక్ రిలేషన్స్ (సీఏఐఆర్) ఆగ్రహం వ్యక్తం చేసింది. యూఎన్ జనరల్ అసెంబ్లీలో పాల్గొనటానికి నెతన్యాహు న్యూయార్క్‌కు వచ్చే అవకాశం ఉండటంతో ఆయనపై ట్రావెల్ బ్యాన్ విధించాలని కోరింది. కాగా నెతన్యాహుపై ట్రావెల్ బ్యాన్ విధించిన తొలి ఈయూ దేశంగా స్లొవేనియా నిలిచింది. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ (ఐసీసీ) అరెస్ట్ వారెంట్‌ను పేర్కొంటూ నెతన్యాహుపై ఈ నిషేధాన్ని విధించింది. స్లొవేనియా తీసుకున్న నిర్ణయాన్ని సీఏఐఆర్ సమర్థించింది. అమెరికాతో పాటు ఇతర దేశలు కూడా ఇదే నిర్ణయాన్ని తీసుకోవాలని కోరింది.




## చాకలి ఐలమ్మ 130వ జయంతి

### చిత్రపటానికి పూలమాల

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు)**

మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భూమి కోసం, భుక్తి కోసం, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా నిలబడి "మా పంట మేమే అమ్ముకుంటాం" అనే నినాదంతో పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. రజాకార్ల గుండెల్లో గుబ్బులు పుట్టించిన వీరనారి దొరలను గడగడలాడించి, పేదల పక్షాన నిలిచి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహిళగా గుర్తించారు.మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎన్. వినయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎం ఆర్ పి ఎస్ జాతీయ నాయకులు తిప్పరపు లక్ష్మణ్ మాదిగ, ఎన్. విజయ్ రావు మాదిగ, ఎన్. వినయ్ ముఖ్య అతిథులుగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కె. బి. జయహరి, కె. విజయకుమార్, కాంతరావు, నరేందర్, నగేష్, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర శస్త్రచికిత్సకు ఎల్ఓసి అందించిన ఎమ్మెల్యే జారె

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):** చంద్రుగొండ మండలం, పోకలగూడెం గ్రామానికి చెందిన ముత్తిని లావణ్య హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు అత్యవసర శస్త్రచికిత్స అవసరమని తెలిసిన గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.10 లక్షల ఎల్ఓసి మంజూరు చేయించారు. ఎమ్మెల్యే స్వయంగా ఆసుపత్రికి వెళ్లి చెక్కును లావణ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం వైద్యులను కలిసి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.




తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
శనివారం-27-సెప్టెంబర్ 2025


# చియా సీడ్స్ తినే విషయంలో అసలు చేయకూడని తప్పులు



నీటిలో నానబెట్టి చియా సీడ్స్ తినడం అనేది సరైన పద్ధతే అయినప్పటికీ మరి కొన్ని సార్లు మాత్రం ఎలా పడితే అలా తింటున్నారు. ఈ అలవాటు కారణంగానే సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా జీర్ణ శక్తిపై ప్రభావం పడుతోంది. చియా సీడ్స్ లో ఫైబర్, ప్రొటీన్, యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే..వీటిని తినే క్రమంలో కొన్ని పొరపాట్లు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంటుంది. మరి చియా గింజలు తినే ప్రాసెస్ లో ఎలాంటి తప్పులు చేయకూడదో తెలుసుకుందాం. చియా గింజలలో బోలెడన్ని పోషకాలుంటాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ తోపాటు ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫలితంగా చియా సీడ్స్ ద్వారా జీర్ణ శక్తి మెరుగవుతుంది. అయితే..వీటిలో క్యాల్షియం, మెగ్నీషియం కూడా ఉంటాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచడంతో పాటు రక్త సరఫరా మెరుగ్గా అయ్యేందుకు సహకరిస్తాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్ కంట్రోల్ చేయడానికి కూడా చియా సీడ్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు బరువు తగ్గించడంలోనూ ఇవి ఎంతో తోడ్పడతాయి. వీటిని పెరుగు, జ్యూస్, స్మూతీలలో కలుపుకుని తినవచ్చు. అయితే ఇందులో ఉండే ఫైబర్ కారణంగా జీర్ణ శక్తి మెరుగవుతుంది. పేగులలో కదలికలు తీసుకొచ్చి సులువుగా మలవిసర్జన జరిగేలా చూస్తుంది. నీటిలో నానబెట్టి వాటితో పాటు కలిపి తీసుకుంటే ప్రయోజనాలుంటాయి. అయితే..ఇన్ ఫ్లమేషన్ తగ్గించడంలోనూ ఇది సాయపడుతుంది. ఇందాకే చెప్పుకున్నట్టుగా ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ అనేది జీర్ణ వ్యవస్థకు బూస్టప్ లాంటిది. సరైన విధంగా తీసుకుంటే చాలాత్వరగా ఉబ్బరం, గ్యాస్, లాంటివి కంట్రోల్ లోకి వస్తాయి. ఇలాంటి జీర్ణ సమస్యలున్న వారు తప్పకుండా చియా సీడ్స్ వాడాలి. వీరితోపాటు బరువు తగ్గాలనుకునే వారికి ఇన్ ఫ్లమేషన్ తగ్గించుకోడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి. ఇన్ ఫ్లమేషన్ అంటే కీళ్లలో మంట, వాపులు రావడం. చియా సీడ్స్ తీసుకుంటే ఈ ఇన్ ఫ్లమేషన్ కి చెక్ పెట్టవచ్చు. కేవలం ఇన్ ఫ్లమేషన్ తగ్గించడం ఒక్కటే కాదు. కాలేయం ఆరోగ్యంగా ఉంచడంలోనూ ఇది ఎంతో తోడ్పడుతుంది. బ్లడ్ ప్రెజర్ ని కంట్రోల్ చేయడంలోనూ చియా సీడ్స్ ఉపయోగపడతాయి. జీర్ణ సమస్యలకు మంచిది కదా అని ఎక్కువ మొత్తంలో వీటిని అసలు వాడకూడదు. ఇలా చేయడం వల్ల పొట్టలో ఇరిటేషన్ వచ్చి సమస్యలు మరింత పెరుగుతాయి. న్యూట్రిషనిస్ట్ రేణు రఖేజా చెప్పిన ప్రకారం చూస్తే..చియా సీడ్స్ తినే విషయంలో చాలా మంది మూడు పొరపాట్లు చేస్తున్నారు. అందులో మొట్ట మొదటిది ఏంటంటే..చియా గింజలను పొడిగా తీసుకోవడం. అంటే..వాటిని నేరుగా తినడం. చియా సీడ్స్ ని ఎప్పుడైనా సరే పొరపాటున కూడా నానబెట్టకుండా తినకూడదు. ఇలా నేరుగా సీడ్స్ తినడం వల్ల గొంతులో వాపు వస్తుందని హెచ్చరిస్తున్నారు రేణు రఖేజా. అంతే కాదు. పొట్టలో విపరీతమైన మంట రావడంతో పాటు పొట్ట ఉబ్బరం వస్తుంది.


# ఈ ఆకుతో షుగర్ మొత్తం కంట్రోల్



మొక్కలు పెంచుకుంటే ఏమవుతుంది. ఈ ప్రశ్నకు రకరకాల సమాధాలు వస్తాయి. స్వచ్ఛమైన గాలి అందుతుంది. మైండ్ కి మంచి రిలాక్సేషన్ వస్తుంది. సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. మనసు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. క్వాలిటీ ఆఫ్ లైఫ్ అనేది ఇంప్రూవ్ అవుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉంటాయి కాబట్టే చాలా మంది ఇళ్లలో మొక్కల పెంపకాన్ని ఓ అలవాటుగా మార్చుకుంటున్నారు. ప్రత్యేకంగా వాటికి సమయం కేటాయిస్తున్నారు. స్థలం కేటాయించి అందులో వాళ్లకు నచ్చిన పూల మొక్కలు, కూరగాయలు పెంచుకుంటున్నారు. అయితే..వీటి వల్ల ఆహ్లాదం మాత్రమే కాదు. ఆరోగ్యం కూడా అందాలంటే మాత్రం ఇప్పుడు చెప్పిన ఓ మొక్క తప్పక పెంచుకోవాలి. అదేంటంటే..ఇన్సులిన్ ప్లాంట్. పేరులోనే ఉంది..ఇన్సులిన్ అని. అంటే..షుగర్ తగ్గించడంలో ఇది ఎంతగానో తోడ్పడుతుంది. మరి ఈ మొక్కలో ఉండే గుణాలేంటి. ఎలా తీసుకుంటే షుగర్ తగ్గుతుందో తెలుసుకుందాం. ఇన్సులిన్ ప్లాంట్. దీన్నే జశీర్‌బం అస్త్రఅవబం అనే శాస్త్రీయ నామంతో పిలుచుకుంటారు. ప్రకృతి వైద్యంలో ఎంతో ప్రాధాన్యత సంపాదించుకుంది ఈ మొక్క. ముఖ్యంగా డయాబెటిస్ ని కంట్రోల్ చేసి మెటబాలిజం మెరుగుపరచడంలో చాలా సహాయపడుతుంది. అందుకే..దీన్ని ఇన్సులిన్ ప్లాంట్ గా చెప్తారు. నిజానికి ఆయుర్వేద వైద్యంలో దీన్ని విరివిగా వాడుతుంటారు. చేయడంతో పాటు జీర్ణ శక్తిని పెంపొందించడంలోనూ ఇది ఉపయోగపడుతుంది. డయాబెటిస్ కి మందులు వాడడం తప్పనిసరి. అయితే.. వీటితో పాటుగా బ్లడ్ షుగర్ లెవెల్స్ ని కంట్రోల్ చేయడానికి ఉపయోగపడే ప్రత్యామ్నాయాలలో ఈ ఇన్సులిన్ ప్లాంట్ చాలా కీలకమైంది. ఇన్సులిన్ ప్లాంట్ తో అసలు ఏయే ప్రయోజనాలుంటాయి. అసలు ఇందులో ఏ గుణాలు షుగర్ ని కంట్రోల్ చేయగలుగుతాయి. ఎలా వాడితే షుగర్ తగ్గుతుంది. ఇన్సులిన్ ప్లాంట్ అనే పేరు రావడానికి ముఖ్య కారణం ..ఈ మొక్క గ్లూకోజ్ మెటబాలిజాన్ని ఇంప్రూవ్ చేస్తుంది. ముఖ్యంగా ఇన్సులిన్ సెన్సిటివిటీని నియంత్రిస్తుంది. ఇందులో హైపోగ్లైసెమిక్ గుణాలు ఉంటాయి. ఇందుకు ముఖ్య కారణం అంటంటే..ఈ మొక్కలో కారోసాలిక్ యాసిడ్ ఉంటుంది. ఈ యాసిడ్ బాడీ సెల్స్ లో గ్లూకోజ్ ట్రాన్స్ పోర్టర్స్ ని యాక్టివేట్ చేస్తాయి. ఫలితంగా రక్తంలో ఉన్న గ్లూకోజ్ అంతా సరైన విధంగా మజిల్స్ కి అందుతుంది. అంటే ఈ గ్లూకోజ్ ఎనర్జీలాగా కన్వర్ట్ అవుతుంది. ఇదే సమయంలో మరీ ఎక్కువ మొత్తంలో గ్లూకోజ్ విడుదల కాకుండా చూడడంలోనూ ఈ ఇన్సులిన్ ప్లాంట్ సహకరిస్తుంది. క్రమంగా బ్లడ్ షుగర్ లెవెల్స్ ని కంట్రోల్ చేస్తుంది. కారోసాలిక్ యాసిడ్ దాదాపు ఇన్సులిన్ హార్మోన్ లాగానే పని చేస్తుంది. భోజనం చేసిన తరవాత సాధారణంగానే షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. ఇలా పెరగకుండా ఈ మొక్క అడ్డుకుంటుంది.


ఈ ఇన్సులిన్ ప్లాంట్ లో యాంటీ ఇన్ ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెట్ గుణాలు అధికంగా ఉంటాయి. ఫ్లేవనాయిడ్స్ ఉండడం వల్ల ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుంది. ఈ స్ట్రెస్ కారణంగానే త్వరగా డయాబెటిస్ పెరుగుతుంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ కండీషన్ నుంచి బయటపడాలంటే ఇంట్లో తప్పనిసరిగా ఈ ఇన్సులిన్ ప్లాంట్ పెంచుకోవాలి. ఇన్సులిన్ ప్లాంట్ తో టైప్ 1 తో పాటు టైప్ 2 డయాబెటిస్ కూడా కంట్రోల్ లోకి వస్తుంది. ఇప్పటికే దీనిపై ఎన్నో పరిశోధనలు జరిగాయి.

# రక్తం చిక్కగామారితే స్ట్రోక్స్ తప్పదు



డీహైడ్రేషన్, క్యాన్సర్, షుగర్, జన్యులోపాల వంటి కారణాల వల్ల చాలా వరకూ రక్తం చిక్కబడుతుంది. రక్తం చిక్కబడితే గుండె సమస్యలు, స్ట్రోక్ వంటి తీవ్ర సమస్యలొస్తాయి. ఆధునిక జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఒత్తిడి పెరగడం వంటి కారణాల వల్ల చాలా వరకూ రక్తం మందంగా మారుతుంది. వీటితో పాటు వయసు పెరగడం, 65 ఏళ్లు దాటినవారిలో రక్తం గడ్డ కడుతుంది. గర్భం, అధిక బరువు, క్యాన్సర్, అన్‌వాంటెడ్ పిల్స్ తీసుకోవడం, హార్మోన్ ట్రీట్ మెంట్, ధూమపానం, సరిలేని లైఫ్‌స్టైల్ కారణంగా రక్తం గడ్డకడుతుంది. దీని వల్ల హెల్త్ ఎఫెక్ట్ అవుతుంది. ఈ సమస్య ప్రారంభ లక్షణాలు వెంటనే స్పష్టంగా కనిపించకపోవచ్చు. కానీ, వీటిని ముందుగానే గుర్తించాలి. లేదంటే చాలా సమస్యలు వస్తాయి. మన బాడీలో అత్యంత ముఖ్యమైన రక్తంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలి. అయితే, నేచురల్‌గానే రక్తాన్ని పల్చబరిచేందుకు కొన్ని ఫుడ్స్ హెల్ప్ చేస్తాయి. ఇవి మీ డాక్టర్‌తో మాట్లాడి తర్వాత తీసుకోవచ్చు. మిరియాలు తీసుకోవడం వల్ల రక్తం పల్చగా మారుతుంది. వీటిని మనం సూప్స్‌లో కలిపి తీసుకోవచ్చు. మామూలుగా వంటల్లో వాడతాం. వీటిలోని సాలిసిలైట్స్ కారణంగా రక్తం చిక్కబడకుండా ఉంటుంది. వీటిని మనం మసాలాల్లో కలిపి తీసుకోవచ్చు. వీటిని తీసుకోవడం వల్ల బీపి కూడా కంట్రోల్ అవుతుంది. రక్తసరఫరా పెరుగుతుంది. ఎక్కువ పరిమాణంలో తీసుకోవద్దు. తీసుకునే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. విటమిన్ ఇ అనేది మనం తీసుకునే మోతాదుని బట్టి ఉంటుంది. వీటిని ఎక్కువ మోతాదులో తీసుకోవద్దు. డాక్టర్ సలహాతో సప్లిమెంట్స్ రూపంలో తీసుకోవచ్చు. వీటిని మనం ఫుడ్స్ ద్వారా కూడా పొందొచ్చు. బాదం, సన్ ఫ్లవర్ ఆయిల్, సన్‌ఫ్లవర్ నట్స్, పీనట్ బటర్, గ్రెయిన్స్ వంటివాటి నుంచి పొందొచ్చు. అయితే పరిమాణం ముఖ్యం. దీనికోసం ముందగా డాక్టర్ సలహా తీసుకోవాలి. అల్లం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్న మరో అద్భుత పదార్థం. దీనిని తీసుకోవడం వల్ల బ్లడ్ గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. అల్లంలో సాలిసైలేట్స్ ఉన్నాయి. అల్లంలోని గుణాలు రక్తాన్ని పల్చబరుస్తాయి. దీనికోసం అల్లాన్ని తాజాగా లేదా ఎండబెట్టి తీసుకోవచ్చు. వీటిని వంటల్లో యాడ్ చేయొచ్చు. అల్లంని టీలా చేసి తాగొచ్చు. రసాలు, స్మూతీలో కూడా కలిపి తాగొచ్చు.

# ఖర్జూరాలను నానబెట్టి తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు



ఖర్జూరం, సహజ సిద్ధమైన ఈ పండు అందరూ ఇష్టపడే ఆహారం. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. అయితే, కొందరికి ఖర్జూరాలను నేరుగా తినడం వల్ల జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. అలాంటి వారికి ఖర్జూరాలను నీటిలో నానబెట్టి తినడం ఉత్తమ పద్ధతిగా పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఈ విధానం జీర్ణక్రియను సులభతరం చేస్తుంది మరియు పోషకాల శోషణను మెరుగుపరుస్తుంది. ఖర్జూరాలను నానబెట్టడం చాలా సులభం. 3 లేదా 4 ఖర్జూరాలను రాత్రి నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం పరగడుపున తినాలి. ఈ పద్ధతి వల్ల ఖర్జూరంలోని పీచు మృదువుగా మారి, జీర్ణం సులభతరం అవుతుంది. అంతేకాకుండా, నీటిలో నానబెట్టడం వల్ల ఖర్జూరంలోని పోషకాలు సులభంగా శరీరంలో శోషించబడతాయి. ఈ విధానం శరీరానికి శక్తిని అందించడంతో పాటు, రోజంతా చురుకుదనాన్ని కాపాడుతుంది.ఖర్జూరాలను నానబెట్టి తినడం వల్ల గుండె ఆరోగ్యం, రక్తహీనత నివారణ, ఎముకల బలం, రోగనిరోధక శక్తి పెరుగుదల వంటి అనేక లాభాలు కలుగుతాయి. ఖర్జూరంలోని పొటాషియం, మెగ్నీషియం, ఇనుము వంటి ఖనిజాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. రోజూ ఈ విధంగా తినడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది మరియు మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాక, ఖర్జూరంలోని సహజ చక్కెరలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. రోజూ ఖర్జూరాలను నానబెట్టి తినడం ఒక చిన్న అలవాటు అయినప్పటికీ, దీని ప్రభావం ఆరోగ్యంపై చాలా గొప్పగా ఉంటుంది. ఈ పద్ధతి అన్ని వయసుల వారికి సురక్షితం మరియు ప్రయోజనకరం. అయితే, షుగర్ రోగులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ఈ సులభమైన ఆహార అలవాటుతో మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోండి మరియు ఖర్జూరాల శక్తిని అనుభవించండి.

# పిచ్చి మొక్కే కదా అని పీకేస్తున్నారా..?

శీతాకాలంలో ఎన్నో రకాల ఆకుకూరలు లభిస్తాయి. ఇవి రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఈ సీజన్‌లో పోషక లక్షణాలతో నిండిన అనేక రకాల ఆకుకూరలను మీరు ఖచ్చితంగా మీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వీటిలో ఒకటి బతువా ఆకుకూర. శీతాకాలంలో వచ్చే వ్యాధులను నివారించడానికి ఈ ఆకుకూరను మీ ఆహారంలో తప్పక ఉపయోగించాలని చెబుతున్నారు. మీరు దీనితో పప్పు, పరాఠా, కూర చేసుకోవచ్చు. అంతేకాదు.. బతువా సూప్ కూడా తయారు చేస్తారు. ఇది రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యంతో నిండి ఉంటుంది. మలబద్ధకం నుండి ఉపశమనం: జీర్ణ సమస్యలు ఉన్న వారికి బతువా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులో ఫైబర్, నీరు అధికంగా ఉంటాయి. ఇది ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి సహాయపడుతుంది. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, మీ ఆహారంలో బతువా ఆకుకూరలను చేర్చుకోండి. ఇది మీ కడుపును శుభ్రపరచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గడానికి: బతువా ఆకుకూరలు బరువు తగ్గడానికి ఒక అద్భుతమైన ఎంపిక. వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వీటిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మీరు ఎక్కువసేపు కడుపు నిండినట్లు ఉండటానికి సహాయపడుతుంది. అతిగా తినకుండా నిరోధిస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది తక్కువ కేలరీల ఆహారం కూడా. మీరు దీన్ని మీ బరువు తగ్గించే ఆహారంలో అనేక విధాలుగా చేర్చుకోవచ్చు. మధుమేహ రోగులకు ప్రయోజనకరం: బతువా ఆకుకూరలు డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయి. వాటిని తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణ స్థాయిలో ఉంటాయి. మీరు డయాబెటిస్‌తో బాధపడుతుంటే, బతువా ఆకుకూరలు తప్పకుండా తినండి. జుట్టుకు ప్రయోజనకరం: బతువాలో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఇతర విటమిన్లు, ఖనిజాలు కూడా పుష్కలంగా ఉంటాయి. మీరు జుట్టు రాలడంతో బాధపడుతుంటే, మీ ఆహారంలో బతువాను చేర్చుకోండి ఎందుకంటే ఇది మీ జుట్టు మూలాలను బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది: బతువాను రోగనిరోధక శక్తిని పెంచేదిగా పిలుస్తారు . ఇందులో అమైనో ఆమ్లాలు, ఫైబర్ మరియు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడే అనేక పోషకాలు ఉంటాయి. ఇది శీతాకాలపు అనేక అనారోగ్యాల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# ఉక్రెయిన్‌పై ట్రంప్ వైఖరి మారిందనుకోవడం లేదు

ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన దిశగా కృషి చేయడానికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇంకా కట్టుబడి వున్నారని తాము భావిస్తున్నామని క్రెమ్లిన్ గురువారం వ్యాఖ్యానించింది. ఈ వారం ప్రారంభంలో ఉక్రెయిన్‌కు అనుకూలంగా ట్రంప్ స్వరం మార్చిన నేపథ్యంలో క్రెమ్లిన్ ఈ వ్యాఖ్యలు చేసింది. రష్యా స్వాధీనం చేసుకున్న భూమిని కీవ్ తిరిగి హస్తగతం చేసుకోగలదని తాను భావిస్తున్నట్లు ట్రంప్ మంగళవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశానంతరం వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు తగిన చర్యలు తీసుకోనందుకు రష్యా వైఖరి పట్ల ట్రంప్ చాలా అసహనంగా వున్నారని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ బుధవారం విలేకర్లతో వ్యాఖ్యానించారు. విశ్వాసంతో రష్యా చర్చలు జరపకపోతే అది వారి దేశానికే మంచిది కాదని అధ్యక్షుడు స్పష్టం చేశారని, అంతేకానీ ఇదేమీ వైఖరి మార్చినట్లు కాదని వాన్స్ చెప్పారు. వాన్స్ వ్యాఖ్యల నేపథ్యంలో అమెరికా వైఖరి మారిందని భావిస్తున్నారా అని విలేకర్లు ప్రశ్నించగా, క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ, అలా అనుకోవడం లేదని అన్నారు. ఉక్రెయిన్‌కు శాంతియుత పరిష్కారాన్ని కనుగొనే దిశగా కృషి చేయాలనే రాజకీయ సంకల్పంతోనే వాషింగ్టన్ ఇంకా వుందని తాము భావిస్తున్నామన్నారు.

# మిగ్-21 యుద్ధ విమానానికి ఐఎఎఫ్ వీడ్కోలు



**రాయ్‌పూర్ :** రష్యాకు చెందిన మిగ్ 21 ఫేర్‌వెల్ కార్యక్రమం చండీగఢ్‌లోని చండీగఢ్ వైమానిక దళ స్టేషన్‌లో శుక్రవారం జరిగింది. 1960 ప్రారంభంలో వాటిని భారత వైమానికదళం (ఐఎఎఫ్) లోకి ప్రవేశపెట్టారు. ఆరుదశాబ్దాల తర్వాత, వాటికి చండీగఢ్‌లో వీడ్కోలు కార్యక్రమం జరగనుంది. 'పాంథర్స్' అని కూడా పిలుచుకునే 23వ నెంబర్ స్క్వాడ్రాన్‌కు చెందిన మిగ్21 జెట్‌లలో చివరి యుద్ధ విమానానికి చండీగఢ్ వైమానిక దళం స్టేషన్‌లో వీడ్కోలు పలకనున్నారు. ఆరుదశాబ్దాల సేవ, లెక్కలేనన్ని విజయ గాథలు, భారత దేశ ప్రతిష్టను గగనానికి తీసుకువెళ్లిన యుద్ధ సైనికులు మిగ్ 21పై ఐఎఎఫ్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మాజీ ఐఎఎఫ్ చీఫ్‌లు ఎస్.పి.త్యాగి, బి.ఎస్.ధనోవాలు పాల్గొననున్నారు. ఐఎఎఫ్ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా కూడా పాల్గొననున్నారు.

## అమెరికా, ఇజ్రాయిల్‌లకు చేదు వార్త

ఇజ్రాయిల్, అమెరికా దేశాలకు ఇది నిజంగా చేదు వార్తే. రష్యా నుంచి ఇరాన్‌కు మిగ్29 యుద్ధ విమానాలు చేరుకున్నాయి. దీంతో టెహ్రాన్ వైమానిక బలం ఇనుమడిరచింది. రష్యా నుంచి వచ్చిన మికోయన్ మిగ్29 ఫైటర్ జెట్‌లో రెండు ఇంజిన్లు ఉంటాయి. ఇది గగనతలంలోనే శత్రువుల యుద్ధ విమానాలను కూల్చివేయగలదు. ఈ విమానం ఇజ్రాయిల్‌కు పెనుముప్పుగా పరిణమిస్తుందని భౌగోళిక రాజకీయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ యుద్ధ విమానాన్ని ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో డిజైన్ చేశారు. ఇటీవల ఇరాన్‌పై ఇజ్రాయిల్ దళాలు కయ్యానికి కాలు దువ్విన విషయం తెలిసిందే. ఇరాన్‌లోని అణు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ బాంబు దాడులు జరిపింది. ఇప్పుడు ఇరాన్ చేతికి మిగ్29 యుద్ధ విమానాలు అందడం ఇజ్రాయిల్‌కు మింగుడు పడని విషయమే. రష్యా నుంచి వచ్చిన యుద్ధ విమానాలను షిరాజ్‌లో మోహరించామని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిటీ సభ్యుడు అబోల్ఫజ్ జొహారేవంద్ తెలిపారు. ఇరాన్ ఇటీవల ఐసీబీఎం (ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్) ఖొర్రంషహర్ 5ను తొలిసారిగా విజయవంతంగా పరీక్షించింది. అమెరికాలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఈ క్షిపణి సొంతం. ఇరాన్ తయారు చేసిన అత్యాధునిక క్షిపణుల్లో ఇది ఒకటి. పైగా రష్యా నుంచి ఎస్400, చైనా నుంచి హెచ్‌క్యూ9 గగనతల రక్షణ వ్యవస్థలను ఇరాన్ పొందబోతోంది. ఇవి ఇరాన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచుతాయి. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలో ఇప్పటికే ఎస్300, బావర్373, ఖర్దాద్, సయాద్, ఎస్200 వంటివి ఉన్నాయి. ఇవన్నీ ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆందోళన కలిగించేవే.



## ఐఎండి ఆరెంజ్ అలర్ట్

**తిరువనంతపురం :** కేరళలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో భారత వాతావరణ శాఖ (ఐఎండి) కేరళలో నాలుగు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. తిరువనంతపురం, పతనంతిట్ట, కొట్టాయం, ఇడుక్కి జిల్లాలల్లో శుక్రవారం 115.5 %% 204.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఈ నాలుగు జిల్లాలకు ఐఎండి ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఇక కొల్లాం, అలప్పుజా, ఎర్నాకులం, త్రిస్సూర్ పాలక్కాడ్ జిల్లాల్లో రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు ఐఎండి ఎల్లో అలర్ట్ ప్రకటించింది. కాగా, ఉత్తర మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం..వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. ఇది శనివారం ఉదయానికి దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ ఒడిశా ఉత్తరాంధలో భారీ వర్షాలు పడనున్నాయి.



## ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు సర్కోజీకి ఐదేళ్ల జైలు శిక్ష

ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీకి అక్కడి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. 2007 అధ్యక్ష ఎన్నికల ప్రచారం కోసం గడాఫీ నేతృత్వంలోని లిబియా ప్రభుత్వం నుండి వచ్చిన నగదుతో సర్కోజీ అక్రమంగా నిధులు సమకూర్చారని ఆరోపణలు వెల్లువెత్తాయి. విచారణలో ఆయన నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు నిర్ధారణైంది. ప్రచారానికి అక్రమంగా నిధులు సమకూర్చడం, అవినీతి సహా ఇతర ఆరోపణల నుండి సర్కోజీని పారిస్ క్రిమినల్ కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. వీటిలో కొన్నింటినీ కొట్టివేయగా, ఒక కేసులో మాత్రం దోషిగా నిర్ధారిస్తూ శిక్ష ఖరారు చేసింది. దీనిపై సర్కోజీ అప్పీలు చేసుకున్నా.. జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. 20072012 వరకు సర్కోజీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన ఆయన 2017లో క్రియాశీల రాజకీయాల నుండి వైదొలిగారు. 2005లో సర్కోజీ అంతర్గత మంత్రిగా ఉన్నప్పుడు, అప్పటి లిబియా ప్రభుత్వానికి అంతర్జాతీయ వేదికపై మద్దతు ఇవ్వడానికి బదులుగా ప్రచారానికి నిధులు పొందేందుకు గడాఫీతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను సర్కోజీ తిరస్కరించారు. ఇవి రాజకీయ ప్రేరేపితమని అన్నారు.

# రామ్‌లీలా ఉత్సవాలపై స్టే తొలగింపు



ఉత్తరప్రదేశ్‌లోని ఒక పాఠశాల మైదానంలో వందేళ్ల నాటి రామ్‌లీలా ఉత్సవాలను నిర్వహించకుండా అలహాబాద్ హైకోర్టు విధించిన స్టేను సుప్రీంకోర్టు గురువారం ఎత్తివేసింది. విద్యార్థులు తమ ఆట స్థలాన్ని కోల్పోకుండా భవిష్యత్‌లో ఈ వేడుకలు నిర్వహించడానికి ఒక ప్రత్యామ్నాయ స్థలాన్ని చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తద్వారా అటు ఉత్సవాల నిర్వాహకుల, ఇటు విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతినకుండా మధ్యేమార్గంగా ఆదేశాలు జారీ చేసింది.రాష్ట్రంలోని ఫిరోజాబాద్ జిల్లాలోని జిల్లా పరిషత్ విద్యాలయంలో జరుగుతున్న రామ్‌లీలా ఉత్సవాలపై హైకోర్టు స్టే విధించడానికి వ్యతిరేకంగా నిర్వాహకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించింది. పాఠశాల మైదానంలో దాదాపు వంద సంవత్సరాలుగా ఈ రామ్‌లీలా వేడుకలు జరుగుతున్నాయని, యాజమాన్యం ఈ ఉత్సవాలకు అభ్యంతరం చెప్పదని, పిల్లలు కూడా పాల్గొంటారని నిర్వాహకులు తమ వాదనలు వినిపించారు. దీనికి హైకోర్టులో పిల్ వేసిన పిటిషనర్ తన వాదనలు వినిపిస్తూ పాఠశాల ఆట స్థలాల్లో మతపరమైన ఉత్సవాలు నిర్వహించడానికి అనుమతించకూడదని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'ఈ కార్యక్రమాన్ని వందేళ్లుగా ఒకే స్థలంలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. ఇంతకాలం జిల్లా అధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదు. ఈ నెల 14న వేడుకలు ప్రారంభమైన తరువాతే కోర్టును ఎందుకు ఆశ్రయించారు? అని ప్రశ్నించింది. హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను రద్దు చేస్తూ పాఠశాల మైదానంలో వేడుకలను కొనసాగించడానికి సుప్రీంకోర్టు అనుమతించింది.

# అమెరికాది దౌర్జన్యమే



కరేబియన్ సముద్రంలో ప్రయాణిస్తున్న పడవలపై మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్నాయన్న కారణంతో అమెరికా వైమానిక దాడులు జరపడం దౌర్జన్యమేనని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో విమర్శించారు. అమెరికా దాడుల్లో కొలంబియన్లు చనిపోయారని విచారణలో తేలితే ఆ దేశ అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. 'మీరు పడవలను ఆపి సిబ్బందిని అరెస్ట్ చేయొచ్చు. కానీ క్షిపణి దాడి ఎందుకు చేశారు?' అని బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికాను పెట్రో నిలదీశారు. మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్న పడవలను ఆపి, సిబ్బందిని అరెస్ట్ చేస్తే మరణాలేవీ సంభవించవని ఆయన చెప్పారు. సముద్రంలో జరుగుతున్న కొకైన్ రవాణాను అడ్డుకునేందుకు అమెరికా సంస్థలు, ఇతర ఏజెన్సీలతో కలిసి చాలా కాలంగా చర్యలు తీసుకుంటున్నామని పెట్రో గుర్తు చేశారు. ఈ చర్యల కారణంగా గతంలో ఎవరూ చనిపోలేదని, ఎవరినీ చంపాల్సిన అవసరమూ లేదని ఆయన తెలిపారు. తుపాకీని ఉపయోగించడం మినహా వేరే ఏ విధమైన ఆయుధాలను ప్రయోగించినా అది చట్ట ఉల్లంఘన కిందికే వస్తుందని అన్నారు. ట్రంప్ తమ ప్రజలను అవమానిస్తున్నారని ఆరోపించారు. తన విదేశీ విధానాల ద్వారా ట్రంప్ అమెరికాను ఏకాకిని చేస్తున్నారని ఎత్తిపొడిచారు. 'ట్రంప్ నన్ను ఇప్పటికే అవమానించారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో నన్ను ఉగ్రవాదిగా సంబోధించారు' అని పెట్రో మండిపడ్డారు.

# పేదలంతా ఐక్యం కావాలి



వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, గ్రామీణ పేదలు ఐక్యంగా పోరాడాలని లోక్‌సభ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అమ్రారామ్, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపునిచ్చారు. రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ పట్టణంలో గురువారం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) 9వ రాష్ట్ర మహాసభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో అమ్రారామ్, బి. వెంకట్ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రాల్లోని బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలుచేస్తూ గ్రామీణ పేదల జీవనాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచి, గ్రామీణ కార్మికులను నిరుద్యోగం, వలసల బాట పట్టేలా చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి పేరుతో పేదల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకొని కార్పొరేట్లకు ఇస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ సంస్థలపై దాడులు, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచే చర్యలు విపరీతంగా పెరిగాయన్నారు. బిజెపి చెబుతున్న గుజరాత్ మోడల్ అంటే కొద్ది మంది కార్పొరేట్ల కోసం పేదలను దోపిడీ చేసేదని చెప్పారు. ఎల్‌డిఎఫ్ నేతృత్వంలోని కేరళ మోడల్ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ, ప్రజల కోసం విద్య, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ఆ తరహా విధానాల అమలు కోసం పేదలంతా పోరాడాలని పిలుపునిచ్చారు.

# వాంగ్‌చుక్ ఎన్‌జిఒకు విదేశీ నిధుల లైసెన్స్ రద్దు

పర్యావరణ కార్యకర్త, లేహ్ ఉద్యమ నాయకుడు సోనమ్ వాంగ్‌చుక్‌కు చెందిన ఎన్‌జిఒ స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లడఖ్‌కు విదేశీ నిధుల లైసెన్సును కేంద్రప్రభుత్వం గురువారం రద్దు చేసింది. ప్రభుత్వం పలు ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పోలీసు బలగాలను మోహరించింది. హింస, పోలీసు కాల్పులు జరిగిన కొన్ని గంటల తర్వాత కేంద్రం, వాంగ్‌చుక్ రెచ్చగొట్టే ప్రకటనల వల్లనే ఇదంతా జరిగిందని విమర్శించింది. లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా కూడా ఇదే తరహాలో ఆందోళనకారులపై వ్యాఖ్యలు చేశారు. హిమాలయన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్ లడఖ్ (హెచ్‌ఐఎఎల్)లో ఎఫ్‌సిఆర్‌ఎ ఉల్లంఘనలు జరిగాయంటూ హోం మంత్రిత్వ శాఖ 10 రోజుల క్రితం సిబిఐ బృందం ఒక ఆర్డర్‌తో వచ్చిందని వాంగ్‌చుక్ పిటిఐకి తెలిపారు. తనను అరెస్టు చేస్తే మరిన్ని సమస్యలు తలెత్తుతాయని సోనమ్ వాంగ్‌చుక్ వ్యాఖ్యానించారు. లడఖ్‌లో తలెత్తిన హింసాత్మక ఘటనలకు తాను కారణమంటూ హోం శాఖ నిందించడాన్ని ప్రస్తావిస్తూ ఇది తనను 'బలిపశువును చేసే ఎత్తుగడ'లంటూ వ్యాఖ్యానించారు. బుధవారం నాడు ఒక్కసారిగా హింస చెలరేగడానికి వాంగ్‌చుక్ కారణమంటూ కేంద్ర హోం శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. దానిపై స్పందిస్తూ కఠినమైన ప్రజా భద్రతా చట్టం (పిఎస్‌ఎ) కింద కేసు నమోదు చేసి, రెండేళ్ల పాటు జైల్లో పెట్టేందుకు వారు చూస్తున్నారని వాంగ్ చుక్ పిటిఐతో వ్యాఖ్యానించారు. దానికి కూడా తాను సిద్ధమేనని చెప్పారు. తనను వదిలివేయడం కన్నా జైల్లో పెడితేనే మరిన్ని సమస్యలు తలెత్తుతాయని ఆయన వ్యాఖ్యానించారు. అసలు సమస్యకు మూలాన్ని పరిష్కరించుకుండా, బలి పశువులను చేయడం కోసం ప్రభుత్వం వెతుక్కుంటోందని అన్నారు. ఒకసారి ఈ హింసను నేను రెచ్చగొట్టానని అంటున్నారు, మరోసారి కాంగ్రెస్ చేసిందంటున్నారని అన్నారు. దీనివల్ల సమస్య పరిష్కారం కాదని అన్నారు. యువత అంతా ఇప్పటికే నిరాశా నిస్పృహలతో, తీవ్ర అసహనంతో వున్నందున తక్షణమే విజ్ఞతతో కూడిన నిర్ణయం తీసుకోవాలన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in